సాక్షి జయశంకర్ భూపాలపల్లి

శనివారం, 16, ఆగస్టు, 2025



సాంకేతికాభివృద్ధిలో కొత్త ఒరవడి

టీజీ ఎన్పీడీసీఎల్‌లో సీఎండీ వరుణ్‌రెడ్డి సాంకేతికంగా కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని ప్రాజెక్టు డైరెక్టర్ మోహన్‌రావు అన్నారు. - 8లో▸



సంఘాలను పటిష్టం చేయాలి

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను మరింత పటిష్టం చేయాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
29.2⁰/24.3⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత సాధారణం. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దేశ సేవకు పునరంకితం కావాలి



భూపాలపల్లి: ప్రతీ పౌరుడు దేశ సేవకు పునరంకితం కావాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎస్పీ.. జాతీయ జెండాను ఎగరవేసి జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారతదేశానికి స్వేచ్ఛ కల్పించిన త్యాగధనులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



రేగొండ: మండలంలోని కొడవటంచ గ్రామంలో కటంగూరి ఉదయశ్రీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 20మంది నిరుపేదలకు రూ.20వేల విలువ చేసే చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు సేవా కార్యక్రమాలు చేయడం గొప్పతనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నవీన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంపత్ రావు, పులి తిరుపతిరెడ్డి, రవీందర్‌రావు, పబ్బ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాగృతి జిల్లా అధ్యక్షుడిగా హరీశ్‌రెడ్డి



భూపాలపల్లి అర్బన్: తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి మాడ హరీశ్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఉత్తర్వులు జారీచేశారు. తనకు మరో సారి జిల్లా బాధ్యతలు అప్పగించడం పట్ల హరీశ్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు ఇచ్చినందుకు జిల్లాలో జాగృతిని బలోపేతం చేస్తామని హరీశ్ రెడ్డి తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



మల్హర్: కొయ్యూరు, వల్లెకుంట గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై శుక్రవారం కొయ్యూరు పోలీసులు దాడులు నిర్వహించారు. వల్లెకుంట గ్రామంలో ఇంట్లో నిల్వ ఉంచిన 20లీటర్లు, 14లీటర్లు గుడుంబాను స్వాధీనం చేసుకొని గుడుంబా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు కొయ్యూరు ఎస్సై నరేశ్ తెలిపారు. రఘు, లక్ష్మికోయ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై 2 రజన్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం'

కాటారం: రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబుపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, ఉపాధిహామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండ్రు రమేష్, కాటారం ప్రచార కమిటీ చైర్మన్ కుంభం రమేష్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంథని డిగ్రీ కళాశాలను సందర్శించి మంత్రి శ్రీధర్‌బాబుపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. న్యాయవాది గట్టు వామన్ రావు దంపతుల హత్య కేసులో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మళ్లీ విచారణ జరపాలని సీబీసీఐడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో పుట్ట మధుకు భయం పట్టుకుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంత్రి శ్రీధర్‌బాబు మంథని నియోజకవర్గంలో పలు ప్రభుత్వ విద్యాసంస్థలు ఏర్పాటు చేసి విద్యారంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నిరుపేద విద్యార్థులకు అందుబాటులో ఉన్నత చదువులు తీసుకొచ్చిన ఘనత శ్రీధర్‌బాబుకు దక్కుతుందని అన్నారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, నాయకులు భూపెల్లి రాజు పాల్గొన్నారు.

ప్రగతి వైపు పయనం

భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లతో పేదల్లో సంతోషం



జాతీయ జెండాను ఎగురవేస్తున్న రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్





మాట్లాడుతున్న రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, గౌరవ వందనం స్వీకరిస్తున్న బెల్లయ్యనాయక్

- అన్నదాతలకు అండగా ప్రజా సర్కారు
- విద్య, వైద్యం, విద్యుత్ రంగాలకు పెద్దపీట
- జిల్లా ఆస్పత్రిలో త్వరలోనే సీటీ స్కాన్ సేవలు
- రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్
- ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

భూపాలపల్లి: ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుంది. ఫలితంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రగతి వైపు పయనిస్తుందని తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్స్, కో–ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ అన్నారు. 79వ స్వాతంత్ర్య వేడుకలను శుక్రవారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ క్రీడా మైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బెల్లయ్య నాయక్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యఅతిథిగా హాజరై, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేలతో కలిసి తొలుత జాతీయజెండాను ఎగురవేసి పోలీసులతో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును బెల్లయ్య నాయక్ వివరించారు. వివరాలు ఆయన మాటల్లో..

భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లతో లబ్ధి..

భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతిని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. జిల్లా వ్యాప్తంగా 223 గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించి 53,763 దరఖాస్తులు స్వీకరించాం. అర్హులకు భూ పట్టాలు జారీ చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాకు మొదటిదశలో 3,512 ఇళ్లు మంజూరు కాగా.. 2,324 ఇళ్లు గ్రౌండ్ అయ్యాయి. 922 ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉండగా ఇప్పటి వరకు రూ.8.28 కోట్లు బిల్లులు లబ్ధిదారులకు చెల్లించాం.

అన్నదాతలకు వెన్నుదన్నుగా..

రైతు భరోసా మొత్తాన్ని ప్రభుత్వం ఎకరాకు రూ.12వేలకు పెంచడంతో పాటు తొలకరి ప్రారంభంలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేశాం. జిల్లాలో 1,15,963 మంది రైతులకు రూ.139,54,73,000 పెట్టుబడి సాయం అందించాం. జిల్లాలోని 29,683 మంది రైతులకు రూ.299,34,47,000 రుణ మాఫీ చేశాం. రూ.9లక్షలతో కొనుగోలు చేసిన 12 డ్రోన్లను మండలానికి ఒకటి చొప్పున అందజేశాం. పండ్ల తోటల పెంపకానికి 3,003 ఎకరాలకు రూ.3.16 కోట్లు మంజూరు లక్ష్యం కాగా ఇప్పటివరకు 1,009 ఎకరాలకు 506మంది రైతులను ఎంపిక చేశాం. ఆయిల్ పామ్ పథకంలో జిల్లాలో 2,500 ఎకరాలు సాగు లక్ష్యం కాగా.. 243 ఎకరాల్లోని 89 మంది రైతులు సాగు చేపట్టారు.

విద్య, వైద్యం, విద్యుత్ రంగాలకు పెద్దపీట..

జిల్లాలో 46,440 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి 24 గంటల పాటు రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం. భూపాలపల్లిలో రూ.2.81 కోట్ల అభివృద్ధి పనులు, 80 అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. జిల్లాలోని ఆరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ బోధన, ఎంపిక కాబడిన ఏడు పీఎంశ్రీ పాఠశాలల్లో ల్యాబ్స్ ఏర్పాటు చేశాం. ఆరోగ్య శ్రీ పథకం కింద 3,905 మందికి రూ.16.38 కోట్ల విలువైన వైద్య సేవలు ప్రభుత్వం అందించింది. టీ హబ్ ద్వారా 67,354 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాం. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన, అత్యవసర వైద్యసేవలు అందించేందుకు రూ.14 కోట్లతో సీటీ స్కాన్ యంత్రం త్వరలోనే ఏర్పాటు చేస్తున్నాం.

'మహాలక్ష్మి'తో తగ్గిన ఆర్థిక భారం..

మహాలక్ష్మి పథకంతో ప్రతీ ఇంటా ఆర్థిక భారం తగ్గింది. జిల్లాలో ఇప్పటివరకు 1.49 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాలు చేయగా రూ.76.75 కోట్లు ఆదా జరిగింది. 68,105 మంది లబ్ధిదారులకు ఇప్పటివరకు 2,36,243 గ్యాస్ సిలిండర్లు అందించి రూ. 6.55 కోట్ల సబ్సిడీని చెల్లించాం.

అర్హులందరికీ రేషన్‌కార్డులు..

పేద ప్రజల ఆహార భద్రతకు జిల్లాలోని 277 చౌక దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. జిల్లాలో మొత్తం 1,25,589 రేషన్ కార్డుల ద్వారా 3,65,010 మంది కుటుంబ సభ్యులు నమోదయ్యారు. వీరికి ప్రతి నెల 2,365 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సన్న బియ్యాన్ని అందజేస్తున్నాం. జిల్లాలో 12,245 మందికి నూతన రేషన్ కార్డులు మంజూరు చేశాం. వీటిలో 35,961 మంది కుటుంబ సభ్యులు నమోదై లబ్ధిపొందుతున్నారు.



స్వాతంత్ర్య సమరయోధుడిని సన్మానిస్తున్న బెల్లయ్యనాయక్



సమాచార పౌర సంబంధాల శాఖ స్టాల్‌ను తిలకిస్తున్న బెల్లయ్యనాయక్, ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే

అవార్డు పొందడం సంతోషం..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు యాస్పిరేషన్ అంశాలలో రాష్ట్రస్థాయిలో అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా కలెక్టర్ రాహుల్ శర్మ అవార్డు తీసుకున్నారని, ఇది మనందరికీ గర్వకారణమని బెల్లయ్య నాయక్ అన్నారు. ముఖ్య అతిథి ప్రసంగం అనంతరం ఉత్తమ ఉద్యోగులకు అవార్డులను ప్రదానం చేశారు. స్వాతంత్ర్య సమరయోధులను ఘనంగా సన్మానించారు. గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేశారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాళ్లను బెల్లయ్యనాయక్ ప్రారంభించారు. అనంతరం పలు పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు వీక్షించారు. ఆయా కార్యక్రమాల్లో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఎఫ్‌ఓ నవీన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, ఆర్డీఓ రవి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా నృత్యం చేస్తున్న పాఠశాల విద్యార్థులు





నృత్యం చేస్తున్న పాఠశాల విద్యార్థులు

ఉత్తములకు అవార్డులు - వివరాలు 8లో▸

నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం

కాటారం: గ్రామీణ ప్రాంతంలోని నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా దుద్దిళ్ల కుటుంబం ముందుకెళ్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఇటీవల మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆపరేషన్ చేయించుకున్న వారికి గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో శ్రీనుబాబు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఆరోగ్య సేవలు చేరవేయడం, కంటి వెలుగులు కోల్పోయే పరిస్థితులను నివారించడం కోసం కంటి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి శస్త్ర చికిత్సలు చేయించి అద్దాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు కంటి సంరక్షణ చర్యలు పాటించి సంతోషంగా ఉండాలని సూచించారు. పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, ఉపాధిహామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండ్రు రమేశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చినాల బ్రహ్మారెడ్డి, జాడి మహేశ్వరి, తెప్పెల దేవేందర్‌రెడ్డి, కుంభం రమేశ్‌రెడ్డి, కొట్టె శ్రీహరి, గద్దె సమ్మిరెడ్డి పాల్గొన్నారు.



అద్దాలు పంపిణీ చేస్తున్న శ్రీనుబాబు

మహనీయుల సేవలు స్మరించుకోవాలి

కలెక్టర్ రాహుల్ శర్మ



ఐడీఓసీలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: స్వాతంత్ర్య సముపార్జన కోసం పోరాడిన మహనీయులను ప్రతీ ఒక్కరు స్మరించుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ శర్మ జాతీయ జెండాను ఎగురవేశారు. తన సతీమణి కతియాని జునేజాతో కలిసి విద్యార్థినులకు స్వీట్లు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ ఐడీఓసీ కార్యాలయానికి చేరుకొని జిల్లా అధికారులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి, స్వాతంత్ర్యం కోసం ఉద్యమించిన వారిని స్మరించుకున్నారు.



విద్యార్థినులకు స్వీట్ బాక్సులు, ప్యాడ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ, ఆయన సతీమణి కతియాని జునేజా

ఏరియాను లాభాల్లోకి తీసుకురావాలి

సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి

భూపాలపల్లి అర్బన్: నష్టాల్లో ఉన్న భూపాలపల్లి ఏరియాను లాభాల్లోకి తీసుకురావాలని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి కోరారు. 79వ స్వాతంత్ర్య వేడుకలను శుక్రవారం ఏరియాలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఏరియా జీఎం కార్యాలయంలో జాతీయ పతాకం ఎగురవేసిన అనంతరం సుభాష్‌కాలనీ సింగరేణి కమ్యూనిటీహాల్‌లో వేడుకలను వైభవంగా నిర్వహించారు. సింగరేణి సెక్యూరిటీ సిబ్బందితో గౌరవ వందనం స్వీకరించి వేడుకలను జీఎం ప్రారంభించారు. ఏరియాలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సింగరేణి కార్మికులకు ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వేడుకలను ఉద్దేశించి జీఎం మాట్లాడారు. 136 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థలో అనేక దశల్లో నూతన సంస్కరణలు చేటుచేసుకున్నట్లు తెలిపారు. సింగరేణి సీఎండీ బలరాం నేతృత్వంలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, కొత్త ప్రాజెక్టుల ప్రారంభం, సంక్షేమ కార్యక్రమాల అమలులో గణనీయమైన అభివృద్ధిని సాధిస్తూ దేశంలో అనేక ప్రభుత్వ రంగ సంస్థలకు మార్గదర్శకంగా నిలుస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏరియా ఉత్పత్తి లక్ష్యం 72 లక్షల టన్నుల సాధించాల్సి ఉందన్నారు. ఏరియాలో గడిచిన మూడు నెలల్లో 22.5 లక్షల టన్నులు వెలికితీయాల్సి ఉండగా 21.8లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు చెప్పారు. అధిక వర్షం కారణంగా ఓపెన్‌కాస్టు 2, 3 ప్రాజెక్టుల లో అనుకున్న స్థాయిలో ఉత్పత్తిని సాధించలేకపోయినట్లు తెలిపారు. దీంతో ఇప్పటి వరకు రూ.331కోట్ల నష్టాల్లో ఉన్నట్లు వివరించారు. భూగర్భగనుల్లో ఎస్‌డీఎల్ యంత్రాల పని విధానం మెరుగుపడాల్సిన అవసరముందన్నారు. యంత్రాల పనితీరు, కార్మికుల గైర్హాజరు శాతం నైపుణ్యం కలిగిన కార్మికులు ఉద్యోగ విరమణ చేయడం వలన బొగ్గు ఉత్పత్తిని సాధించలేకపోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గుర్తింపు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



జాతీయజెండాను ఎగురవేస్తున్న జీఎం



ఉత్తమ కార్మికుడికి అవార్డు అందజేస్తున్న జీఎం, అధికారులు, నాయకులు



సాంస్కృతిక కార్యక్రమాల్లో నృత్యంచేస్తున్న విద్యార్థులు

విద్యకు ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల: విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రావుపల్లిలోని ఉన్నత పాఠశాలలో డైనింగ్‌హాల్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉత్తమ విద్యతో పాటు విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలను కల్పిస్తుందని అన్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన నేరేళ్ల లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె సభ్యులను కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రేగొండ: మండలంలోని కొడవటంచ గ్రామానికి చెందిన మూల సారయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు సంపత్‌రావు, తిరుపతిరెడ్డి, రవీందర్ రావు, శ్రీనివాస్, మూల ఓంకార్ ఉన్నారు.



డైనింగ్‌హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో విద్యార్థికి గాయాలు


చికిత్స పొందుతున్న విద్యార్థిని సిరి

చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థిని దైనంపల్లి సిరి తొమ్మిదో తరగతి చదువుతుంది. శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా వేడుకల ఏర్పాట్లలో భాగంగా స్టీల్ పైపుతో కూడిన జెండాలను పట్టుకుని వెళ్తున్న క్రమంలో పాఠశాల ఆవరణలో విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యార్థిని సిరి చేతికి, కాలుకు గాయాలు అయ్యాయి. గమనించిన పాఠశాల సిబ్బంది హుటాహుటిన స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించా రు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కారుకులైన వారిపై చర్యలు తీసుకోవాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం ఆస్పత్రిలో ఉన్న బాలికను పరామర్శించారు.

ఉత్తములకు అవార్డులు


అవార్డు అందుకుంటున్న ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మల్హార్‌నాయక్

జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో అవార్డులను అందజేశారు.

భూపాలపల్లి


రవి, ఆర్డీవో, భూపాలపల్లి
నరేష్‌కుమార్, ఏఎస్పీ
శ్రీనివాసరావు, డీపీఆర్ఓ


సునిల్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి
గడ్డి అంజనేయులు, బీపీఓ, పంచాయతీరాజ్
జితేందర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ సీఐ
నారాయణనాయక్, డీఎస్పీ, వర్టికల్
మల్లేష్‌యాదవ్, సీఐ, చిట్యాల
వెంకటేశ్వర్లు, సీఐ, మహదేవపూర్
సతీష్, సీఐ
సుధాకర్, ఎస్సై, టేకుమట్ల
శ్రావణ్, ఎస్సై, చిట్యాల
శ్రీనివాస్, ఎస్సై, కాటారం


శ్రీనివాస్, ఎస్సై, ఎస్బీ
రాజేష్, ఆర్ఎస్సై
వెంకన్న, ఏఎస్సై
రాజ్‌కుమార్, పీసీ, ఎస్బీ
షాఖాన్, ఎస్సై 2, రేగొండ
శ్రీకాంత్, పీసీ, ఇంటెలిజెన్స్
సరిత, అంగన్‌వాడీ టీచర్
విజయ్‌కుమార్, మండల స్టాటిస్టికల్ ఆఫీసర్
రజిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్
మహేందర్, సీనియర్ అసిస్టెంట్


రవీందర్‌రెడ్డి, ఏఎస్సై, రేగొండ
రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్
మహేష్, ఈఓ, కాళేశ్వరం దేవస్థానం
సుస్మిత, వైద్యాధికారి
జయశ్రీ, ఎంపీడీఓ, చిట్యాల
బ్రహ్మేశ్వర్‌రావు, డీఏఓ, కాటారం


సత్యనారాయణస్వామి, తహసీల్దార్
శ్రీనివాస్, తహసీల్దార్, భూపాలపల్లి
సిద్ధార్థరెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి
వీరభద్రయ్య, డివిజనల్ పంచాయతీ అధికారి
హరిహర, కలెక్టరేట్ సూపరింటెండెంట్
రాజ్‌కుమార్ ఐటీడీఏ ఏఓ


ముఖ్యఅతిథి బెల్లయ్యనాయక్‌కు జూట్ బ్యాగ్‌ను అందజేస్తున్న సెర్ప్ సభ్యులు

డెంగీతో బాలిక మృతి


శాన్విక (ఫైల్)

వేలేరు: డెంగీ జర్వంతో బాలిక మృతి చెందింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాలిక కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సూత్రపు రమేష్ కూతురు శాన్విక(7)కు ఐదు రోజల క్రితం జర్వం రాగా చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానాకు తీసుకెళ్లారు. పరీక్షలు చేసిన వైద్యులు డెంగీగా గుర్తించి చికిత్స చేస్తున్న క్రమంలో శుక్రవారం ఉదయం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దంత వైద్యశిబిరానికి స్పందన


టూత్‌పేస్ట్ అందజేస్తున్న డాక్టర్ గిరిధర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: భారత స్వాతంత్య్ర దినోత్సవం, ఎస్వీఎస్ దంత వైద్యశాల 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ చౌరస్తాలోని దంత ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని అనూహ్య స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ గిరిధర్‌రెడ్డి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, టూత్‌పేస్టులు, మౌత్ వాష్‌లు అందజేశారు. దంతాల పరిరక్షణపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. వైద్య శిబిరంలో వైద్యులు గణేష్, హారిక, సిబ్బంది యాకూబ్‌రెడ్డి, సౌమ్య, చంద్రిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వాజేడు: కనువిందు చేస్తున్న బొగత జలపాతం

బొగత కనువిందు

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని బొగత జలపాతం శుక్రవారం ఉధృతంగా ప్రవహిస్తూ కనువిందు చేస్తోంది. దండకారణ్యంలోని కర్రె గుట్టలపై గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో పైన ఉన్న వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో జలపాతానికి భారీగా వరద వస్తోంది.

విద్యార్థి ఆత్మహత్య


సాయివర్ధన్ (ఫైల్)

బచ్చన్నపేట: తండ్రి మందలించాడని మనస్థాపంతో విద్యార్థి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని లింగంపల్లిలో గురువారం రాత్రి జరిగింది. కుటుంబ సభ్యులు, ఎస్సై అబ్దుల్ హమీద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేడబోయిన నర్సమ్మ-మల్లయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. చిన్న కుమారుడు సాయివర్ధన్ (20) హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నాడు. సాయివర్ధన్ సరిగా చదవడంలేదని తండ్రి మల్లయ్య మందలించాడు. దీంతో సాయివర్ధన్ క్షణికావేశంలో తమ బావి వద్ద ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి


బన్నీ (ఫైల్)

పెద్దవంగర: అనుమానాస్పద స్థితిలో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని ఉప్పరగూడెం గ్రామానికి చెందిన గద్దల బన్నీ (17) తన చిన్నతనంలో తల్లిదండ్రులు మృతి చెందడంతో అమ్మమ్మ గ్రామమైన ఉప్పరగూడెంలో తాత కొమురయ్య సంరక్షణలో పెరిగాడు. పదో తరగతి పూర్తి కావడంతో ప్రస్తుతం నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. రాఖీ పౌర్ణమితోపాటు వరుస సెలవులు రావడంతో అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. శుక్రవారం తాత పొలం పనులకు వెళ్లాడు. అనంతరం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై క్రాంతికిరణ్‌ను వివరణ కోరగా ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వర్ధన్నపేట మార్చురీకి తరలించామని, ఫిర్యాదు అందితే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడతామని తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదన్నారు.


పాకాల సరస్సు మత్తడి వద్ద స్థానికుల సందడి..

పాకాల మత్తడి పరవళ్లు


సరస్సు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దొంతి

ఖానాపురం:వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని పాకాల సరస్సు మత్తడి పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలతో సరస్సులోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. సరస్సు పూర్తిస్థాయి నీటిమట్టం 30.3 ఫీట్లు. శుక్రవారం మత్తడి పోయడంతో ప్రజలు మత్తడి వద్ద సందడి చేశారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మత్తడిని సందర్శించి పూజలు చేశారు.

సంఘాలను మరింత పటిష్టం చేయాలి

- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు


సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రవీందర్ రావు, డైరెక్టర్లు

హన్మకొండ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను మరింత పటిష్టం చేయాలని తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డీసీసీబీలు, టెస్కాబ్ పాలకవర్గాలకు ప్రభుత్వం ఆరు నెలలు పొడిగింపు ఇచ్చిన సందర్భంగా శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చిత్రపటాలకు పాలక వర్గంతో కలిసి రవీందర్ రావు పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు సేవ చేసేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. వరంగల్ డీసీసీబీని ఆర్థికంగా మరింత బలోపేతం చేస్తామన్నారు. వ్యవసాయ రంగానికి సేవలు విస్తృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంక్ డైరెక్టర్లు హరిప్రసాద్, మాడుగుల రమేష్, దొంగల రమేష్, ఎర్రబెల్లి గోపాలరావు, మురళి, సంపెల్లి నరసింగరావు, నరేందర్ రెడ్డి, పోలపాక శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు రాజేష్ ఖన్నా, రామచంద్ర రావు, లక్ష్మారెడ్డి, దేవేందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్ గౌడ్, డీసీసీబీ సీఈఓ వజీర్ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికాభివృద్ధిలో కొత్త ఒరవడి

- టీజీ ఎన్పీడీసీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ మోహన్‌రావు



మాట్లాడుతున్న వంగూరు మోహన్ రావు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి సాంకేతికంగా కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని ప్రాజెక్టు డైరెక్టర్ వంగూరు మోహన్‌రావు అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో మోహన్‌రావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఏపీటీఎస్-విజిలెన్స్ వారిచే గౌరవ వందనం స్వీకరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగ అమరులకు కార్యాలయం ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో 18 జిల్లాల్లో 70 లక్షల మంది వినియోగదారులకు 24/7 మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. 2024 సంవత్సరం (ఏప్రిల్ నుంచి జూలై) తో పోల్చుకుంటే 33 కేవీ బ్రేక్ డౌన్స్ 2025 (ఏప్రిల్ నుంచి జూలై) లో 21శాతం, 11 కేవీ బ్రేక్ డౌన్లు 46శాతం తగ్గాయన్నారు. విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ సీఎండీ వరుణ్ రెడ్డి స్వీయ ఆలోచనతో రూ. కోటి బీమా సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. పునరుత్పాదక శక్తి జూన్ 30, 2025 నాటికి ఎన్పీడీసీఎల్‌లో 2155.87 మెగావాట్ల సోలార్ ఎనర్జీ జనరేషన్ సామర్థ్యాన్ని సాధించామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వంటేరు తిరుపతి రెడ్డి, మధుసూదన్, చీఫ్ ఇంజనీర్లు అశోక్ కుమార్, తిరుమల్‌రావు, రాజుచౌహాన్, అశోక్, వెంకటరమణ, మాధవరావు, సీజీఎంలు చరణ్ దాస్, రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరి రమేష్, కంపెనీ కార్యదర్శి వెంకటేశం, వరంగల్ ఏపీటీఎస్ సీఐ కిరణ్ పాల్గొన్నారు.

నలుగురు గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

- 25 కిలోల 800 గ్రాముల గంజాయి, కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నరసింహారావు


నిందితుల అరెస్టు చూపుతున్న ఏసీపీ నరసింహారావు

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీసులు, తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ డ్రగ్స్ కంట్రోల్ టీం ఆధ్వర్యంలో నలుగురు గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. హనుమకొండ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ నరసింహారావు వెల్లడించిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం హనుమకొండ కుమార్‌పల్లిలోని సెయింట్ జోసెఫ్ స్కూల్ దగ్గర నలుగురు వ్యక్తులు ఎండు గంజాయి కలిగి ఉన్నారని వచ్చిన సమాచారంతో నార్కొటిక్స్ సీఐ శ్రీకాంత్, ఎస్సై సీహెచ్ పరుశురాములు, సిబ్బందితో కలిసి వెళ్లి కారులో గంజాయిని తరలిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్‌కు చెందిన ఎండీ ఫైజాన్, ఎస్‌డీ అన్సార్, ఎండీ అర్బాన్, కుమార్‌పల్లికి చెందిన అర్షద్ అలీఖాన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి 25కిలోల 800గ్రాముల ఎండు గంజాయితోపాటు ఐదు సెల్ ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఫైజాన్, అన్సార్, అర్బాన్.. ఆంధ్రప్రదేశ్- ఒడిశా బార్డర్ వద్ద బాలు అనే వ్యక్తి నుంచి గంజాయిని తీసుకొచ్చి హనుమకొండలోని కుమార్‌పల్లీ చెందిన అర్షద్ అలీఖాన్ ఇంట్లో డంప్‌చేసి, అవసరమైన వాళ్లకి విక్రయిస్తుంటారు. ఈక్రమంలో గంజాయిని కారులో తీసుకొస్తూ పోలీసులకు పట్టుబడ్డారని తెలిపారు. నిందితులను హనుమకొండ పోలీసులకు అప్పగించగా ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యాంటీ నార్కొటిక్ డ్రగ్స్ కంట్రోల్ టీం, హనుమకొండ పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.